కథ

# చిత్తరువుల చిత్రాలు

**అలియాస్ ఫొటోల తూటాలు.. అలియాస్ స్టేటస్ కాక్టస్!**

టి. సంపత్ కుమార్
98104 02895

సౌందర్యకు ఆరోజు అరగంట మొదలే మెలకువ య్యింది. బెడ్డు మీదనుంచి ఇంకా దిగనే లేదు. కుడిచేయి యాంత్రికంగా పక్కనే టేబుల్‌పై నిద్రిస్తున్న మొబైల్ ఫోన్‌ను లేపి.. మొహం ముందుకు తెచ్చింది. స్క్రీన్ సేవర్‌గా ప్రతిష్ఠించిన అమ్మవారిని కళ్లనిండా చూసి, మనసులోనే మొక్కుకున్నది. ఆ తరువాత ఉత్సాహంతో వాట్సప్ వేదికను నొక్కింది. తన బంధుమిత్రులు స్టేటస్‌లో పెట్టిన ఫొటోలను చూడటం మొదలుపెట్టింది. సౌందర్య నిద్రలో ఉన్నపుడు విదేశాల్లో ఉన్న బంధువులు, స్నేహితుల నుంచి సందేశాలు, ఫొటోలు వస్తూనే ఉంటాయి. సూర్యుడు రోజూ ఉదయించినట్టుగా.. సౌందర్య స్మార్ట్‌ఫోన్ కొన్నప్పటినుంచీ వాట్సప్ యాప్‌ను మృదువుగా నొక్కడంతో తన దినచర్యకు శ్రీకారం చుడుతుంది. సూర్య కిరణాల్లా తన జీవితంతో దట్టంగా, దూరంగా, బీరకాయ పీచులాంటి బంధాలు, స్నేహాలు, సామాజిక వేర్లు విస్తరించి ఉన్నాయి. తన ఫోన్‌లో నిక్షిప్తమై ఉన్న ఓ నలభై 'ఆప్తుల' స్టేటస్‌లలోకి ప్రవేశించి, హృదయాలను చూడటం సౌందర్య చేసే రోజువారీ పని. ఫొటోలను చూశాకే పనులు ఆరంభం! పొగమంచుతో, మబ్బు, వర్షాలతో సూర్యుడు ఉదయాన కనిపించక పోవచ్చు. వ్యక్తిగత, కుటుంబ, సామాజిక, ఇతర కారకాలు ఎన్ని ఆవరించి ఉన్నా.. వాట్సప్ స్టేటస్‌లోకి ప్రవేశించి, చిన్నగా కనిపించే చిత్తరువుల్ని బొటన – చూపుడు వేళ్లతో ఠక్కున పెంచి, కళ్లలో నింపుకోవాల్సిందే! అదొక యాంగ్జయిటీ! లక్షల, కోట్ల జనాభాలో తిష్ఠ వేసుకొన్న మానసిక ఆందోళన.

జీవితాల్లోని క్షణాల్ని సహజంగా, కృత్రిమంగా, లేనిది ఉన్నట్టుగా, ఉన్నదాన్ని లేనట్టుగా కనికట్టు మాయలతో పట్టేసుకొని, మనకే పరిమితం చేసుకోకుండా.. నలుగురితో 'స్టేటస్' (ఈ ఇంగ్లిష్ పదానికి వాడుకలోనున్న అర్థాలు : హోదా, దర్జా, అంతస్తు, స్థితి, పదవి, స్థాయి, అవస్థ, ప్రతిష్ఠ) పంచుకోడానికి సాంకేతిక రంగం అందించిన, మనసుల్ని దోచుకొన్న.. ఇంపైన సొంపైన వేదిక. చూసుకునేవారికి చూసుకునేంత.. తీసుకునేవారికి తీసుకునేంత!

స్టేటస్‌లలో పెట్టుకొన్న ఫొటోలు సౌందర్యపై ఏదో ఒక రూపంలో ప్రభావం చూపుతాయి. విహారయాత్రలు చేస్తూ పెట్టిన ఫొటోలు, కొత్త డిజైన్ నగలు ధరించి పోజులతో దిగిన ఫొటోలు, పిక్‌నిక్‌లు, కిట్టీపార్టీలు, పట్టు చీరలు కట్టుకొని చేస్తున్న పూజలు, పూలు కోస్తూ, ముగ్గులు వేస్తూ, విమానాల్లో సీట్లల్లో కూచున్న ఫొటోలు.. వైవిధ్యమైన ఆలోచనలకు డిజిటల్ ఫొటోలు క్షణాల్లో ప్రత్యక్షం అవుతూనే ఉంటాయి. రన్నింగ్ కామెంటరీ అనకూడదు కానీ, బ్రిస్క్ వాకింగ్ కామెంటరీ అంటే సరిపోతుంది. చెప్పకుండానే ఎంతో చెప్పే పవర్‌ఫుల్ ఛానెల్. ఎన్‌లార్జ్ చేసి చూస్తే.. ఎక్స్‌రే లెవల్లో వివరాలు! ఇతరుల మనసుల్లో అలజడి సృష్టించడానికి, ఈర్ష్య బీజాలు నాటడానికి.. ఎంతో సంతోషంగా ఉన్నామని కనిపిస్తూ, ఇతరుల సంతోషాన్ని హరించుకోవడానికి చలామణిలో ఉన్న కమ్యూనికేషన్ టెక్నాలజీ ప్రపంచం అందించిన వైరస్.. ఈ స్టేటస్!

చూసిన ఫొటోలను బట్టి సౌందర్య మూడ్ ప్రతి రోజూ.. గంటగంటకూ, నిమిషనిమిషానికీ, క్షణక్షణానికీ.. స్టాక్ ఎక్స్‌చేంజ్ మార్కెట్ ప్రవర్తనలా పైకి కిందికీ కదులుతుంటుంది. సౌందర్యే కాదు.. రజని, కవిత, ఈశ్వరి, చారులత, ఆఫ్రీన్, నందిని, తరుణి, మనీశా, జూలియా, అమృత, చంద్రకళ, శాలినీ, ఫరీదా.. ఎందరో.. మరెందరో! వేలల్లో.. లక్షల్లో.. కోట్లల్లో!

ఈ వైరస్ బారినపడ్డ మగవారూ లేకపోలేదు. వారూ ఉన్నారు. అయితే మైనారిటీయే! మోహన్, రమేశ్, కమలాకర్, సాయినాథ్, అన్వర్, సదానంద్, జాన్, గుర్విందర్.. ఇంకా ఎందరో! వేలల్లో.. లక్షల్లో!

